క్లుప్తంగా

ఘనంగా మాతృ దినోత్సవం



వృద్ధులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక శ్రీ సాయి లలిత వృద్ధాశ్రమంలో వృద్ధుల మధ్య విశ్వ మాతృ దినోత్సవం వేడుకలను స్థానిక హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులను ఘనంగా సన్మానించారు. అమ్మను మించిన దైవం లేదని అలాంటి అమ్మలను వృద్ధాప్య దశలో వృద్ధాశ్రమంలో వదలడం సమంజసం కాదన్నారు. ఆ తర్వాత వృద్ధులకు పాలు, పండ్లు అందించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకుడు నాగభూషణ, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహన అదుపు తప్పి శివమ్మ అనే మహిళతో పాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. రక్త గాయాలతో పడి ఉన్న వారిని గమనించి సీపీఐ నాయకురాలు పవిత్ర మడకశిర ఆస్పత్రికి తీసుకొచ్చి వైద్య చికిత్సలు అందించారు. శివమ్మ తలకు బలమైన దెబ్బ తగిలింది.

సమాజ సేవకుడికి పురస్కారం



అవార్డు స్వీకరిస్తున్న నందీశ్

పావగడ: తాలూకాలోని మేఘల పాళ్య తండాకు చెందిన నందీశ్ నాయక్ అందించిన సామాజిక సేవలను గుర్తించి విశ్వ గురు బసవణ్ణ జయంతిని పురస్కరించుకుని కళా సంగమ సాంస్కృతిక ట్రస్ట్ ఆధ్వర్యంలో 'కాయక యోగి సేవా రత్న' ప్రశస్తిని సోమవారం అందించారు. బెంగళూరులో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన అవార్డును స్వీకరించారు.



గుడిబండ: పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



హెచ్‌డీ హళ్లిలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేయడానికి బారులు తీరిన ప్రజలు



అగళి మండలం ఇనగలూరులో ఇలా...



రొళ్ల పట్టణంలోని 115 పోలింగ్ కేంద్రంలో రాత్రి 8.30 తర్వాత కూడా ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు



రొళ్ల : ఓటు హక్కు వినియోగించుకున్నట్లు సిరా గుర్తు చూపుతున్న రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని



రొళ్లలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు



రొళ్ల మండలం కె.బ్యాడిగెర పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరిశంకర్‌రావు

పోలింగ్ ప్రశాంతం



హిందూపురం: సిరా గుర్తును చూపుతున్న యువతి

- హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో భారీగా పోలింగ్
- ఓటేసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు
- ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించిన టీడీపీ శ్రేణులు
- కొన్నిచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- వర్షం పడటంతో కొన్నిచోట్ల పోలింగ్‌కు అంతరాయం

హిందూపురం: హిందూపురం నియోజకవర్గంలో చెదురు మదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 253 పోలింగ్ స్టేషన్లో పరిధిలో పోలింగ్ సోమవారం ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. ప్రారంభంలోనే కొట్నూరు స్కూల్ బూత్ 17లో ఈవీఎం కొంతసేపు పనిచేయకపోవడంతో గంటకు పైగా ప్రజలు వేచి ఉండాల్సి వచ్చింది. అలాగే నేతాజీ స్కూల్ వద్దకు ఈవీఎం మొరయించడంతో ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. తర్వాత అధికారులు ఈవీఎం సరిచేయడంతో పోలింగ్ ప్రారంభమైంది.

ఓటేసిన ప్రముఖులు

వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి టీఎన్.దీపిక, జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, టీడీపీ అభ్యర్థి బాలకృష్ణ తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అనుకూలించిన వాతావరణం

వాతావరణం అనుకూలించడంతో పాటు ఎండ లేకపోవడంతో ఓటర్లు ఉదయం నుంచి బూత్‌ల వద్ద బారులు తీరి ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 11 గంటలకు హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా 22 శాతం ఓటింగ్ పోల్ అయింది. మధ్యాహ్నం 3 గంటలకు 53% ఓట్లు నమోదయ్యాయి. నియోజకవర్గ వ్యాప్తంగా చిన్న చిన్న సంఘటనలు మినహా ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

టీడీపీ ప్రలోభాలు

చిలమత్తూరు మండలం హుస్సేన్‌పురంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా దీంతో కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకుంది. చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, కార్యకర్త నవీన్ యువకుడిపై దాడి చేశారు. దాడిలో ఎంపీపీకి గాయాలు కాగా నవీన్‌కు తీవ్రంగా తలపై గాయాలైయ్యాయి. 105, 106 పోలింగ్ బూత్‌లలో టీడీపీ నాయకుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అనిల్‌కుమార్ చాలాసేపు పోలింగ్ కేంద్రం వద్దనే ఉంటూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు చూడటంతో కొంత వాగ్వాదం చేసుకుంది. దీంతో పోలీసులు కల్పించుకుని అందర్ని దూరంగా పంపించివేశారు. అలాగే చౌడేశ్వరీకాలనీ స్కూల్ బూత్ వద్దకు బాలకృష్ణ చేరుకోవడంతో జనం ఎగబడటం, బాలకృష్ణ మహిళలను మాట్లాడుతూ అక్కడే నిలిచి వారితో ఫొటోలు దిగుతూ ఎన్నికల నిబంధలను ఉల్లంఘించారు.

రాత్రి 8 తర్వాత కూడా...

హిందూపురం పట్టణంలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు అడుగున ఉండటంతో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. సాయంత్రం 7 గంటల తర్వాత 73.32 శాతం ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటల సమయంలో పట్టణ పరిసరా ప్రాంతాల్లో జోరు వర్షం కారణంగా పోలింగ్ కేంద్రాల్లో జనం చేరుకోవడంతో కొంతసేపు పోలింగ్‌కు ఆటంకం ఏర్పడింది. సాయంత్రం 6 గంటలు ముగిసేసరికి పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు గేట్లను మూసి వేశారు. క్యూలైన్‌లో నిల్చుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. రాత్రి 8 గంటల తర్వాత వరకూ కొన్నిచోట్ల పోలింగ్ జరిగింది.

తరలివచ్చిన యువత, మహిళలు, వృద్ధులు

హిందూపురం టౌన్: హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఓటు వేయడానికి ఎండ, వానను లెక్కచేయకుండా ఓటర్లు తరలివచ్చారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనడంతో హిందూపురం నియోజకవర్గంలో పోలింగ్ 80 శాతానికి పైగా చేరుకుంది.



మడకశిర మండలం కల్లుమర్రిలో ఓటు వేయడానికి క్యూలో నిలిచి ఉన్న మహిళలు

మడకశిరలో 241కేంద్రాల్లో పోలింగ్

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఓటర్లు ఉదయం నుంచే ఓటు హక్కు వినియోగించు కోవడానికి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూకట్టారు. సాయంకాలం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసినా పలు కేంద్రాల వద్ద ఓటర్లు క్యూలైన్ ఉండడంతో వారికి ఓటు వేయడానికి ఎన్నికల అధికారులు అనుమతించారు. నియోజకవర్గంలోని మడకశిర రూరల్, మడకశిర అర్బన్, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాల్లోని 241 పోలింగ్ కేంద్రాల్లో కూడా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

మొరాయించిన ఈవీఎం

మడకశిర పట్టణంలోని 195 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. దీంతో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. అదే విధంగా అమరాపురం మండలంలోని కాచికుంటలో కూడా మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈవీఎం మొరాయించడంతో గంట పాటు పోలింగ్‌కు అంతరాయం కలిగింది.

పోలింగ్ శాతం ఇలా..

ఉదయం 9 గంటలకు 3.50 శాతం, ఉదయం 11 గంటలకు 29 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 46.20 శాతం, మధ్యాహ్నం 3 గంటలకు 63.40 శాతం, సాయంకాలం 4 గంటలకు 66.20 శాతం, సాయంకాలం 5 గంటలకు 71.25 శాతం, సాయంకాలం 6 గంటలకు 74.25 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఎన్నికల అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. దిశ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రూరల్, అర్బన్ సీఐలు రాజ్‌కుమార్, మనోహర్ బందోబస్తును పర్యవేక్షించారు.

అమరాపురంలో...

అమరాపురం: మండలంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 52 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభం కాగా కాచికుంట, దేవగానపల్లి గ్రామంలో కాస్తా ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. అయితే ఆ రెండు గ్రామాలతో పాటు గొడనకుంట గ్రామంలో ఎస్ఐ. జనార్ధననాయుడు పోలీసుల చొరవతో రాత్రి వరకూ ఓటు వేయించారు. మండలంలో సాయంత్రం 6 గంటల వరకూ 76 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

అగళిలో...

అగళి: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో సాయంత్రానికి 75 శాతం పోలింగ్ జరిగిందన్నారు.

గుడిబండలో...

గుడిబండ: మండల వ్యాప్తంగా ఓటు వేసేందుకు ఉదయం నుంచి 47 పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కేంద్రాలలో పెద్ద ఎత్తున మహిళలు, వృద్ధులు తరలివచ్చారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం 6 గంటల తర్వాత కూడా ఓటు వేసేందుకు క్యూలైన్లలో వేచి ఉన్నారు.

రొళ్లలో...

రొళ్ల: మండల వ్యాప్తంగా 32 పోలింగ్ కేంద్రంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణలో ముగిశాయి. పోలింగ్ కేంద్రాల సరళిని ముగ్గురు రూట్ ఆఫీసర్లు, ముగ్గురు సెక్టర్ ఆఫీసర్లు పర్యవేక్షించారు. రొళ్ల పోలింగ్ కేంద్రం 117ఎలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, పోలింగ్ కేంద్రం 118లో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు, దొడ్డేరి 130 పోలింగ్ కేంద్రంలో ఎంపీపీ కవిత కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా కె.బ్యాడిగెర 127 పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరిశంకర్‌రావు సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రొళ్ల జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో గల 115 పోలింగ్ కేంద్రంలో రాత్రి 8.30 గంటల వరకూ క్యూలో నిలిచి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం హునిసేంట 103 పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప సందర్శించారు.

పోలింగ్ సైడ్‌లైట్స్

- హిందూపురం మండలం కొట్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. దీంతో పోలింగ్ అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది.
- కిరికెర బసవన్న కాలనీలో రోడ్డు సౌకర్యం కల్పించలేదంటూ కాలనీ వాసులు రెండు గంటల పాటు ఓటింగ్‌ను బహిష్కరించారు. రెండు పార్టీల నాయకులు వెళ్లి సర్దిచెప్పడంతో ఓటింగ్‌లో పాల్గొన్నారు.
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దీపిక హిందూపురం మండలం వీరేపల్లి గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- ఎమ్మెల్యే బాలకృష్ణ దంపతులు ఆర్టీసీ కాలనీలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- లేపాక్షిలో ఏజెంట్ల విషయంగా వైఎస్సార్‌సీపీ- టీడీపీ నాయకులు 188 పోలింగ్ బూత్‌లో చొరబడ్డారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.

ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా జడ్జి



అమరాపురం మండలం తమ్మడేపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్న అనంతపురం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శివశంకర్ దంపతులు, కుమార్తె

అమరాపురం మండలంలోని తమ్మడేపల్లిలో అనంతపురం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కె.శివశంకర్ తన ఓటు హక్కును వినియోగించుకుని ఓటు ప్రాముఖ్యతను తెలియజేశారు. తన కుటుంబ సభ్యులతో పాటు ఆయన ఓటు వేశారు. అలాగే మండలంలోని హేమావతి, కె.శివరం, ఆలదపల్లి, బసవనపల్లి, వలస, తదితర గ్రామాల్లో జరగుతున్న పోలింగ్ సరళిని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పరిశీలించారు. వృద్ధులు తమ సహాయకులతో వచ్చి ఓటు వేశారు.

స్వేచ్ఛగా ఓటేయండి : ఈరలక్కప్ప



హేమావతిలో అందరూ స్వేచ్ఛగా ఓటేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మండల పరిధిలోని తన స్వగ్రామమైన పళారం గ్రామంలో ఉదయం 8 గంటలకు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 75వ పోలింగ్ కేంద్రానికి వెళ్లి సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటర్లందరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అందరూ ఓటు వేసి మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు.



హిందూపురం: ఓటు వేసినట్టు చూపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్



మడకశిర మండలం కల్లుమర్రిలో వృద్ధురాలిని వీల్‌చైర్‌లో ఓటు వేయడానికి తీసుకొస్తున్న దృశ్యం



కొట్నూరులో ఈవీఎం పనిచేయకపోవడంతో వేచి చూస్తున్న మహిళలు

గుడిబండలో భారీ వర్షం




భారీ వర్షాలకు ఓ రైతు తోటలో నిలిచిన నీరు

గుడిబండ: మండలంలో భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వక్కతోటలు, పంట పొలాల్లో భారీగా వర్షం నీళ్లు నిలిచాయి. అత్యధికంగా గుడిబండలో 46.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం బాగా కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోర్లు కూడా బాగా రీచార్జ్ అవుతాయంటున్నారు.



వక్క తోటలో నిలిచిన నీరు

ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్



మోడల్ కాలనీలో ఓటు వేసేందుకు బారులు తీరిన జనం

హిందూపురం అర్బన్: హిందూపురం నియోజక వర్గ వ్యాప్తంగా సోమవారం 253 పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోల్‌ను పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో నిర్వహించారు. తరువాత ఉదయం 7 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉదయం 9 గంటలకు 9.52 శాతం, 11 గంటలకు 21.83 శాతం, 1 గంటకు 42.68 శాతం, 3 గంటలకు సమయానికి 1,33,856 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



చిలమత్తూరు మండలం మరువకొత్తపల్లి వద్ద సీఐ ఈరన్న ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు

బారులు తీరిన ఓటర్లు



అమరాపురం:కె.శివరంలో ఓటు వేయడానికి బారులు తీరిన మహిళలు

మడకశిరరూరల్: మడకశిర పట్టణంతో పాటు రూరల్‌లో వృద్ధులు, మహిళలు, యువకులు అన్నివర్గాల ప్రజలు ఓటువేయడానికి ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంతో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల బారులు తీరారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి దంపతులు నీలకంఠాపురంలో, మడకశిరలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి దంపతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మడకశిరలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైస్ రవిశేఖర్‌రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



మడకశిరలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



మడకశిర మండలం ఉప్పిడేపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు వేచివున్న మహిళలు